క్లుప్తంగా

అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు

గొల్లపల్లి: అర్హులైన పేద ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తామని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. శ్రీరాములపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఎమ్మెల్సీతో కలిసి ప్రభుత్వ విప్ ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిధి పెంపు వంటి పథకాలను అమలు చేశామన్నారు. మండల అధ్యక్షుడు ముస్కు నిశాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ గోస్కుల జలంధర్, సర్పంచ్ నేరెళ్ల గంగాధర్, ఉప సర్పంచ్ ఆశిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమండ్లు, ఎంపీటీసీ దనవ్వ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై అసహనం

శ్రీరాముపల్లి పంచాయతీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో అధికారుల తీరుపై ఎమ్మెల్సీ అసహనం వ్యక్తం చేశారు. గతంలో పంచాయతీ కార్యాలయ భూమి పూజ అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా నిర్వహించారు. అప్పుడు వేసిన శిలాఫలకం పెద్దదిగా ఉండి, పెద్ద అక్షరాలతో మంత్రి, ఎంపీ తదితర ప్రజాప్రతినిధుల పేర్లతో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, విప్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పేర్లతో ఉన్న శిలాఫలకం చిన్నదిగా కనిపించడంతో ఎమ్మెల్సీ అసహనం వ్యక్తం చేశారు. పీఆర్‌డీఈ రహమాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రక్తదానం చేసిన యువకుడు

కథలాపూర్: చింతకుంట గ్రామానికి చెందిన యువకుడు కాశవత్రి వంశీ గురువారం ఒకరికి రక్తదానం చేశారు. కోరుట్లకు చెందిన గాండ్ల సత్యనారాయణ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యం కోసం రక్తం అత్యవసరమని తెలపడంతో.. వంశీ స్పందించి కోరుట్లకు వెళ్లి రక్తదానం చేశారు.

సింగిల్‌విండో చైర్మన్‌పై అవిశ్వాస పరీక్ష 5న

కథలాపూర్: సిరికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌పై అవిశ్వాస పరీక్ష వచ్చే నెల 5న ఉంటుందని జిల్లా సహకార అధికారి సత్యనారాయణ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ డైరెక్టర్లు జిల్లా సహకార అధికారికి లేఖ అందించారు. 5న ఉదయం 11.30 గంటలకు డైరెక్టర్లు సమావేశానికి హాజరు కావాలని అధికారులు తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెల్గటూర్: మండల కేంద్రంలోని 33 కేవీ లైన్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఈ లైన్ పరిధిలోని వెల్గటూర్, ముత్తునూర్, స్తంభంపల్లి సబ్ స్టేషన్ల పరిధి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని వెల్గటూర్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

ఆదాయ పన్ను రద్దుకు పోస్టుకార్డు ఉద్యమం

జగిత్యాల: ప్రభుత్వ పెన్షనర్లను ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలని పెన్షనర్లు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారని, దీనికి నిరసనగా ప్రధాన మంత్రికి పోస్టుకార్డులు పంపినట్లు పెన్షనర్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ తెలిపారు. 35 ఏళ్ల ప్రభుత్వం, ప్రజలకు సేవలందించే ఉద్యోగులకు ఇచ్చే గౌరవ భృతిపై ఆదాయపు పన్ను వసూలు చేయడం సరికాదన్నారు. విజయ్, హన్మంతరెడ్డి, ప్రకాశ్, యాకూబ్ పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు 20 వరకు

జగిత్యాల: గురుకుల 5వతరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ దరఖాస్తు గడువు ఈనెల 20 వరకు పొడిగించామని సాంఘిక సంక్షేమ జిల్లా సమన్వయాధికారి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో 4వతరగతి చదువుతున్న విద్యార్థులు 5వతరగతికి, 10వతరగతి పూర్తి చేసుకునే విద్యార్థులు ఇంటర్‌కు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 5వతరగతికి రూ.100, ఇంటర్‌కు రూ.200 ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు. 2024 ఫిబ్రవరి 11న ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రవేశ పరీక్ష సంబంధిత ప్రవేశ పరీక్ష కేంద్రాల్లో జరుగుతుందని, ఒకే సెల్ నెంబరుతో దరఖాస్తు చేసుకోవాలని, మిగతా వివరాలకు 97045 50173లో సంప్రదించాలన్నారు.

సమీక్ష సమావేశం



జగిత్యాలరూరల్: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని జీపీడీపీ, బీపీడీపీ అంశాలపై సర్పంచులు, ఎంపీటీసీలకు కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జీపీడీపీ, బీపీడీపీలపై తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రవిబాబు, సూపరింటెండెంట్ గంగాధర్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

నిలిచిన అభివృద్ధి పనులు

- కలగానే మినీ స్టేడియం
- పూర్తి కాని డబుల్ బెడ్‌రూం పనులు
- ఈ ప్రభుత్వంలోనైనా పనులు పూర్తయ్యేనా?



నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూం నిర్మాణ పనులు

రాయికల్: పట్టణంలో నిరుపేదలకు గూడు కల్పించాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిలిచిపోయాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2012లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మినీస్టేడియం ఇంకా పూర్తి కాలేదు. దీంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇవే కాకుండా మండలంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి.

మినీ స్టేడియం పూర్తయ్యేదెన్నడో..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాయికల్‌లో మినీ స్టేడియం నిర్మాణానికి రూ.2.10 కోట్లతో 18 అక్టోబర్ 2012న ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఐదెకరాలను కేటాయించి 16 ఫిబ్రవరి 2014న పనులు ప్రారంభించారు. సుమారు 50 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. పట్టణంలో క్రీడలకు స్థలం లేకపోవడంతో ఖాళీగా ఉన్న ప్రైవేటు భూముల్లో అరకొర వసతులతో విద్యార్థులు, యువకులు క్రీడా పోటీలు నిర్వహించుకుంటున్నారు. ఇటీవల ప్రభుత్వం క్రీడల ప్రాధాన్యాన్ని గుర్తించి ప్రతి ఊరికి క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయగా పట్టణంలో నిలిచిన మినీ స్టేడియం నిర్మాణ పనులను వేగవంతం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎనిమిదేళ్లుగా ఎదురుచూపులే..

గూడు లేని నిరుపేదలకు పక్కా భవనం నిర్మించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పట్టణంలో నిలిచిపోయింది. రాయికల్ పట్టణంలో 60 ఇళ్ల నిర్మాణాల కోసం 2015లో దరఖాస్తులను ఆహ్వానించగా 1211 దరఖాస్తులు వచ్చాయి. అధికారులు ఐదు బృందాలుగా ఏర్పడి సర్వే నిర్వహించి 126 మందిని అర్హులుగా తేల్చారు. వీరిలో నుంచి ఫిబ్రవరి 22, 2016లో రాయికల్ పట్టణంలోని మండలక్లబ్ కల్యాణ మండపంలో నిర్వహించిన డ్రాలో 60 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం రెవెన్యూ అధికారులు రాయికల్ శివారులోని 146 సర్వే నంబర్లో 1.03 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారు. ఎనిమిదేళ్ల క్రితమే ప్రభుత్వ భూమిని ఇళ్ల నిర్మాణాల కోసం అప్పగించారు. అనంతరం 16 జూన్ 2017న అప్పటి ఎంపీ కవిత, అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలిసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ స్థలంలో జీ ప్లస్ టూ పద్ధతిలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు రాగా కేవలం 24 మంది లబ్ధిదారులకు సరిపడా భవన నిర్మాణాలను ప్రారంభించగా పిల్లర్ల దశలోనే పనులు ఆగిపోయాయి. మరో 36 లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించలేదు. ఇప్పటికైనా అధికార పార్టీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పందించి పనులను పూర్తి చేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న మినీ స్టేడియం

నిరుపేదలకు గూడు కల్పించాలి



రాయికల్ పట్టణంలో ఎనిమిదేళ్ల క్రితం లక్కీడిప్ ద్వారా డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ఎంపిక చేశారు. అప్పటి నుంచి నేటి వరకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా మాలాంటి నిరుపేదలకు గూడు కల్పించాలి.

– రాపర్తి శాంత, డబుల్ బెడ్‌రూం లబ్ధిదారు

కాంట్రాక్టర్‌కు నోటీసులిచ్చాం



డబుల్ బెడ్‌రూం నిర్మాణ పనులు మొదటగా పంచాయతీరాజ్ నుంచి ఆర్‌అండ్‌బీ పరిధికి, ఆ తర్వాత మళ్లీ పంచాయతీరాజ్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇళ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్‌కు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నోటీసులు సైతం ఇచ్చాం.

– ప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ

ఎన్టీఆర్‌కు నివాళి



జగిత్యాలటౌన్: నివాళి అర్పిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గ టీడీపీ నాయకులు గురువారం టవర్ సర్కిల్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు అక్కినపెల్లి కాశీనాథం, సోమ నారాయణరెడ్డి, ఓరుగంటి భార్గవరాం, కొండ శ్రీధర్, మగ్గిడి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురిలో..

ధర్మపురి: పట్టణంలోని నంది కూడలి వద్ద టీడీపీ నాయకుడు ఉప్పుల రామకిష్టయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు గుండారపు రాజశేఖర్, గడ్డం భాస్కర్‌రెడ్డి, సుధవేని నర్సాగౌడ్, బండారి రాజన్న, శ్రీనివాస్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో..

మెట్‌పల్లి: టీడీపీ నాయకులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రవీణ్, గణేశ్, మహాదేవ్, బాలే మారుతి, షేక్ నజీర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశయ సాధనకు కృషి చేయాలి

మల్లాపూర్: ఎన్టీఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ సాదుల్లా అన్నారు. సిరిపూర్‌లో టీడీపీ జెండా ఆవిష్కరించి నివాళి అర్పించారు. నాయకులు శ్రీనివాస్, చందు, సత్యం, లక్ష్మీపతి, లక్ష్మారెడ్డి, గంగారెడ్డి, శంకర్, లింగారెడ్డి, పద్మ, రాజగంగు, మల్లవ్వ, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయికల్‌లో..

రాయికల్: పాత బస్టాండ్‌లో మండల టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల అధ్యక్షుడు మోర గణేశ్, నిజామాబాద్ పార్లమెంటరీ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సోమ నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి మారంపల్లి సాయిలు, నాయకులు రాజిరెడ్డి, లక్ష్మీనర్సయ్య, పాషా, రాహూఫ్ పాల్గొన్నారు.

మధుమేహ నిర్ధారణ పరీక్షలు



కోరుట్లటౌన్: పరీక్షలు చేస్తున్న దృశ్యం

కోరుట్లటౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి, ఓ మందుల కంపెనీ సంయుక్తంగా మధుమేహ వ్యాధిగ్రస్తులకు గురువారం ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఆసుపత్రిలో ఉచిత క్యాంపు ఏర్పాటు చేసినట్లు డాక్టర్ రంగనాథ్ తెలిపారు. మధుమేహ వ్యాధితో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షించి, ఉచితంగా నిర్ధారణ పరీక్షలు చేసినట్లు పేర్కొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

రాయికల్: రాయికల్‌లోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. 250 మందికి పరీక్షలు నిర్వహించగా.. 120 మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆస్పత్రికి పంపిస్తున్నట్లు తెలిపారు. జెడ్పీ కాటిపల్లి రాంరెడ్డి, డీసీ బత్తిని భూమయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొమ్ముల ఆదిరెడ్డి, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి గంట్యాల ప్రవీణ్, సభ్యులు ఎద్దండి దివాకర్, కడకుంట్ల నరేశ్, పారిపల్లి శ్రీనివాస్, సామల్ల గోపాల్, బొమ్మకంటి నవీన్, కనపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మల్యాల: మండలంలోని ముస్లిం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు ముస్లిం కమిటీ సభ్యులు వినతి పత్రం సమర్పించారు. మండలానికి చెందిన ముస్లిం కమిటీ నాయకులు, సభ్యులు మేడిపల్లి సత్యంను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. షేక్ బాబు, అబ్దుల్ కరీం, అజీమ్‌ఖాన్, షేక్ అయాజ్ జాఫర్, సాజీద్, సల్మాన్‌ఖాన్, కాంగ్రెస్ మల్యాల పట్టణ అధ్యక్షుడు కటుకం వినయ్, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు కోరెపు వేంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

భాగస్వాములు కావాలి

కథలాపూర్: గ్రామాల్లో ఓటరు నమోదుకు స్పెషల్ డ్రైవ్ ఉందని, అధికారులు భాగస్వాములు కావాలని ఎంపీడీవో జనార్దన్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో పాటు కార్యదర్శులు, బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు.

క్రైం కార్నర్..



సైబర్ కేసుల నమోదు

కథలాపూర్(వేములవాడ): మండలంలో వేర్వేరుగా జరిగిన సైబర్ నేరాలతో ఇద్దరు వ్యక్తులు రూ.80వేలు మోసపోయారు. కథలాపూర్‌కు చెందిన యువకుడి సెల్‌ఫోన్‌కు రూ.30వేలు చెల్లిస్తే రూ.45వేలు వస్తాయని అనే మెస్సేజ్ వాట్సాప్‌లో వచ్చింది. స్పందించిన యువకుడు ఈనెల 16న రూ.30వేలు బ్యాంక్ ఖాతా ద్వారా చెల్లించారు. ఆ తర్వాత స్పందన రాకపోవడంతో రూ.30వేలు మోసపోయినట్లు గ్రహించి గురువారం పోలీసులను ఆశ్రయించారు. దూలూర్ గ్రామానికి చెందిన ధనుంజయ్ ఎస్‌బీఐ సైట్ ఓపెన్ చేసి సెల్‌ఫోన్ నెంబర్‌కు వచ్చిన ఓటీపీని ఎంటర్ చేశారు. కొద్దిసేపటి తర్వాత తన అకౌంట్‌లోని రూ.50వేలు మాయమైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు.

దాడికి పాల్పడిన వ్యక్తి రిమాండ్

మెట్‌పల్లిరూరల్: కొండ్రికర్ల గ్రామానికి చెందిన మెండె రవిపై దాడికి పాల్పడిన మాజీ ఉప సర్పంచ్ ఆకుల శ్రీనివాస్‌ను రిమాండ్‌కు పంపినట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు. గ్రామంలోని పోచమ్మ అలయం సమీపంలో బుధవారం జరిగిన దాడి ఘటనపై హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. గురువారం సాయంత్రం పెద్దాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నామని, దాడి సమయంలో ఉపయోగించిన ఐరన్ రాడ్, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

ఇసుక డంప్ స్వాధీనం

మల్లాపూర్: రేగుంటలో గురువారం రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ వీర్‌సింగ్ తెలిపారు. గ్రామానికి చెందిన మిట్టపెల్లి రాజేశ్వర్‌రెడ్డి ఎలాంటి అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన ఇసుక డంపులను స్వాధీనం చేసుకొని పంచనామా నిర్వహించామన్నారు. సుమారు 5 ట్రిప్పుల ఇసుకను ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకున్నామని, శుక్రవారం ఆ డంప్ వద్దే ఇసుక వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్‌ఐలు రాజేశ్, సురేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

రాయికల్: కట్కాపూర్ శివారులోని మామిడి తోటలో పేకాట ఆడుతున్న 9 మందిని గురువారం ఎస్సై అజయ్ అరెస్ట్ చేశారు. వారిపై కేసు నమోదు చేసి రూ.7,890 జప్తు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

ఇబ్రహీంపట్నం: ఫకీర్‌కొండాపూర్ గ్రామంలో విద్యుదాఘాతంతో మేక మృతిచెందింది. గ్రామానికి చెందిన కుంబం గంగమల్లయ్య మేకలను గ్రామ శివారులోని ఓ వ్యవసాయ భూమిలో మేపుతున్నాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న ఎర్త్ తీగకు విద్యుత్ సరఫరా కావడంతో మేక మృతిచెందినట్లు, మేక విలువ సుమారు రూ.20వేలుంటుందని బాధితుడు తెలిపారు.

విద్యుత్ అధికారులతో సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గురువారం విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలు తదితర అంశాలను చర్చించారు. వ్యవసాయానికి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ అందించేందుకు సరైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కోరుట్ల, మెట్‌పల్లి విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మంచి ఆరోగ్యం

కోరుట్లరూరల్: ప్రకృతి వ్యవసాయంతో మంచి ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. కల్లూర్ శివారులో గల బ్రహ్మకుమారి చారిటీస్‌లో గురువారం ప్రజాపిత బ్రహ్మ 55వ పుణ్య తిథి వేడుకలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ అంజయ్య, ఉప సర్పంచ్ రాకేశ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, సీనియర్ నాయకుడు చీటి వెంకట్రావు, నిర్వాహకులు రాజేశ్వరి, చిద్రాల భూమయ్య, శైలజ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యమందించాలి

కోరుట్లటౌన్: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి పనితీరును పరిశీలించారు. వైద్యుల హాజరు, రికార్డులు చూశారు. వసతులు, వైద్య చికిత్సలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో చర్చించారు.

ఆధ్యాత్మికం



నృసింహుడి సన్నిధిలో డీఎస్పీ పూజలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో గురువారం జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ప్రధాన ఆలయమైన యోగా నృసింహస్వామితో పాటు అనుబంధ దేవాలయాల్లో పూజలు చేశారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్ స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలను అందజేశారు. ఎస్సై దత్తాత్రి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని శుద్ధి చేసిన నాయకులు

జగిత్యాలటౌన్: బీజేపీ నాయకులు గురువారం జిల్లా కేంద్రంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో దేవాలయ శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. ప్రధాని పిలుపు మేరకు స్వచ్ఛత అభియాన్ కార్యక్రమంలో భాగంగా మన ప్రాంతంలోని ఆలయాలను శుభ్రం చేయాలన్నారు. ప్రతి ఇల్లు, ఆలయాల్లో దీపాలు వెలిగించి శ్రీరామ నామ జపం చేయాలని కోరారు. శ్రావణి, సత్యనారాయణరావు, ఆముద రాజు పాల్గొన్నారు.

ఆలయం ముస్తాబు

మెట్‌పల్లిరూరల్: వెల్లుల గ్రామంలోని శ్రీప్రహ్లాద సహిత లక్ష్మీనరసింహస్వామి ఆలయం జాతర ఉత్సవాలకు ముస్తాబైంది. ఆలయంలో ఈనెల 21 వరకు 24వ యాగ మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. శుక్రవారం వివిధ ప్రత్యేక పూజలతో మొదలై చివరి రోజు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించి భక్తులకు అన్నదానం చేయనున్నారు.

22న వేలంపాట

రాయికల్: రాజరాజేశ్వరస్వామి నాగాలయంలో ఈనెల 22న కొబ్బరికాయలు, పూజ సామగ్రి, లడ్డు, పులిహోర విక్రయం, తలనీలాలు, కొబ్బరి ముక్కల పోగు, బెల్లం అమ్మకాలు, మామిడి కాయల విక్రయం కోసం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి విక్రమ్ గురువారం తెలిపారు.

ఆది శ్రీనివాస్‌ను కలిసిన యాదవ సంఘం



ప్రభుత్వ విప్‌తో యాదవ సంఘం సభ్యులు

కథలాపూర్: భూషణరావుపేట గ్రామానికి చెందిన యాదవ కృష్ణ యువజన సంఘం సభ్యులు గురువారం వేములవాడలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిశారు. ఆది శ్రీనివాస్‌ను శాలువాలతో సన్మానించారు. యాదవ సంఘం భవనానికి నిధులు కేటాయించాలని కోరగా.. సానుకూలంగా స్పందించారని సభ్యులు పేర్కొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి విపక్షాలు కలిసి రావాలి

మల్లాపూర్: రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వంతో విపక్షాలు కలిసి రావాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం వేములవాడలో ఆది శ్రీనివాస్‌ను కిసాన్ కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఎన్నికల్లో రైతులకిచ్చిన హామీ మేరకు నిజాం షుగర్ ఫ్యాక్టరీలను త్వరలోనే పునరుద్ధరిస్తామన్నారు.

పీఆర్టీయూ డైరీ ఆవిష్కరణ

జగిత్యాల: పీఆర్టీయూ రూపొందించిన డైరీని కలెక్టర్ యాస్మిన్ బాషా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయులపైనే ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, కార్యదర్శి బోయినిపల్లి ఆనందరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అబ్దుల్ జమీల్ పాల్గొన్నారు.

బ్యాంక్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మసూర్

జగిత్యాలరూరల్: గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ బ్యాంక్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ మేనేజర్ మసూర్ అన్నారు. గురువారం ఒడ్డెర కాలనీలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ధరూర్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామస్తులు బ్యాంక్‌లో ఉన్న ఇన్సూరెన్స్, రుణాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. డిజిటల్ లావాదేవీలు జరిగేలా చూడాలని సూచించారు. మ్యాజిక్ షో, పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ రాజమణి, ఉప సర్పంచ్ నాగవ్వ, ఏపీఎం గంగాధర్, సీసీ గంగారాం, వీవోఏ మమత, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసవ్వొద్దు



విద్యార్థులు, అధ్యాపకులు, పోలీసులు, వైద్యాధికారులతో సీసీఎస్ సీఐ

మల్లాపూర్: యువత, విద్యార్థులు చిన్న వయసులోనే వ్యసనాలకు బానిసగా మారి చెడుదారి పట్టొద్దని జగిత్యాల సీసీఎస్ సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో జగిత్యాల పోలీస్ ఆధ్వర్యంలో మై చాయిస్ ఫౌండేషన్ టీమ్‌తో కలిసి విద్యార్థినులకు షీ టీమ్స్, సైబర్ క్రైమ్స్, డయల్ 100పై అవగాహన కల్పించారు. మండల వైద్యాధికారిణి డాక్టర్ వాహిని, మై చాయిస్ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ సుధాకర్, పీహెచ్‌సీ సీహెచ్‌వో రామ్మోహన్, సీసీఎస్ ఏఎస్సై బేగ్, మల్లాపూర్ హెడ్ కానిస్టేబుల్ అశోక్, కానిస్టేబుల్ తిరుపతి, మహిళా కానిస్టేబుళ్లు పూజిత, మంజుల, సౌజన్య, మోడల్ స్కూల్ అధ్యాపకులు లచ్చిరాంనాయక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలి



మాట్లాడుతున్న మణికంఠరెడ్డి

జగిత్యాలటౌన్/జగిత్యాల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి కోరారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ విద్యను ప్రైవేట్‌పరం చేసి పేద విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర చేస్తోందన్నారు. జిల్లా కార్యదర్శి అక్రమాలిక్, నాయకులు మేకల సంజయ్, శివసాయిరెడ్డి, రాహుల్, నాగరాజ్, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల కోసం స్థల పరిశీలన



అమ్మక్కపేటలో స్థలం పరిశీలిస్తున్న ఆర్డీవో

ఇబ్రహీంపట్నం: అమ్మక్కపేట గ్రామంలో ఇంటర్నేషనల్ పాఠశాల నిర్మాణం కోసం గురువారం మెట్‌పల్లి ఆర్డీవో మధు స్థలాన్ని పరిశీలించారు. గ్రామ శివారులోని సర్వే నెంబర్ 40లో 10 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. ఈ స్థలం పాఠశాల నిర్మాణానికి అనువుగా ఉందా లేదా అని పరిశీలించారు. తహసీల్దార్ ప్రసాద్, ఆర్‌ఐ రమేశ్, సర్వేయర్ రమేశ్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి మండలంలో..

మెట్‌పల్లిరూరల్: మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు అధికారులు స్థల పరిశీలన చేశారు. మెట్‌పల్లి ఆర్డీవో మధు రెవెన్యూ అధికారులతో కలిసి వెల్లుల దసరా గుట్ట ముందు, రామలచ్చక్కపేట శివారులో స్థలాలను పరిశీలించారు. తహసీల్దార్ శేఖర్, ఆర్‌ఐ ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.